క్లుప్తంగా

సంతాపం



భాస్కర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి పట్ల గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సంతాపం తెలిపారు. శనివారం సాయంత్రం అనంతపురం వెళ్లి భాస్కర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.తిమ్మారెడ్డి, కౌన్సిలర్ లింగన్న, నాయకులు గోవింద్ నాయక్, దిలీప్‌రెడ్డి, సోమిరెడ్డి, రహంతుల్లా తదితరులు ఉన్నారు.

పామిడి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.వీరాంజనేయులు నివాళులర్పించారు. ఆయన భార్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, కుటుంబసభ్యులను పరామర్శించారు.

పేరం స్వర్ణలతకు పరామర్శ



పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను శనివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆమె బ్రెయిన్ సంబంధిత సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేరం అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

'దళిత రణభేరి' విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా దళితులపై ఆగని దాడులను నిరసిస్తూ ఈ నెల 24న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో దళిత రణభేరి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. దళిత, బహుజనులపై దాడులను అరికట్టడంలో కూటమి సర్కార్ విఫలమైందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జామిని, పరుశురాముడు, సుధాకర్, రాధాకృష్ణ, మల్లికార్జున, విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షౌర వృత్తిదారుల సంఘం కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: క్షౌరవృత్తిదారుల సంఘం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా బ్రహ్మ, సహాయ కార్యదర్శులుగా బాలకృష్ణ, సోమశేఖర్, నవీన్, వంశీ, కుమార్, పరుశురాముడు, శివకుమార్, ఉపాధ్యక్షుడిగా బాల, వాసు, అజయ్, శంకర్‌తో పాటు 11 మంది సభ్యులు ఎన్నికయ్యారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ దుకాణాలను తొలగించేంత వరకూ దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సదాశివం

బుక్కరాయసముద్రం: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సదాశివంను జిల్లా ఉన్నత అధికారులు నియమించినట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కుమారుడి పెళ్లి పనుల నిమిత్తం ప్రస్తుత ఎంపీడీఓ సాల్మన్ ఈ నెలాఖరు వరకు సెలవు పెట్టారు. దీంతో ఈఓఆర్డీగా పనిచేస్తున్న సదాశివంను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు.



పీహెచ్‌సీలో మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డ జనరేటర్

జనరేటర్ ఉన్నా.. ప్రయోజనం సున్నా

పెద్దపప్పూరు: ప్రభుత్వాస్పత్రిలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వైద్య సేవలకు అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంలో పెద్దపప్పూరు పీహెచ్‌సీకి ప్రభుత్వం జనరేటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఏడాదిన్నరగా జనరేటర్ మరమ్మతులకు నోచుకోక మూలనపడింది. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇన్వర్టర్లను ఏర్పాటు చేసుకుని సర్దుకుపోతున్నారే కానీ జనరేటర్‌ను మరమ్మతు చేయిస్తామన్న ఆలోచన అధికారులకు లేక పోవడం విడ్డూరం. ఇదే విషయమై డీటీఓ లోకేష్‌కుమార్‌ను సాక్షి ఫోన్‌లో ప్రస్తావించగా జనరేటర్ చెడిపోయిన విషయం వాస్తవమేనని, ఇదే విషయం ఉన్నతాదికారులకు నివేదిక పంపామన్నారు.



మార్కండేయస్వామి ఆలయం వద్ద యూ టర్న్ మధ్యలో అడ్డంగా వాహనాల పార్కింగ్

ఇష్టారాజ్యంగా పార్కింగ్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయం వద్ద ఉన్న యూ టర్న్‌లో వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి సీబీరోడ్డులో పెద్ద సంఖ్యలో వాహనరాకపోకలు కొనసాగిస్తుంటాయి. వీటివల్ల తరచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సమీపంలో నాలుగు కూడళ్ల సర్కిళ్లు రెండు ఉన్నాయి. గాంధీ సర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్ మధ్యలో మార్కండేయస్వామి ఆలయం వద్ద ఉన్న యూటర్న్ ఉంది. కార్లు, ద్విచక్ర వాహనదారులు వెళ్లడానికి వీలుగా ఉన్న యూటర్న్ మధ్యలో కార్లను పార్కింగ్‌గా నిలుపుతుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. యూ టర్న్ సర్కిల్‌లో వాహనాలను పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పట్టణవాసులు వాపోతున్నారు.

కలెక్టర్‌కు స్వాగతం



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

తాడిపత్రి రూరల్: మండల సరిహద్దులో శనివారం కొత్త కలెక్టర్ ఒ.ఆనంద్‌కు ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ సోమశేఖర్ స్వాగతం పలికారు. నెల్లూరు నుంచి తాడిపత్రి మీదుగా అనంతపురానికి వెళ్తున్న ఆయనను తాడిపత్రి మండల సరిహద్దు బొందలదిన్నె వద్ద కలిసి పూల మొక్క అందజేశారు. ఆనంతరం ఆయన వెంట ఆర్డీఓ, తహసీల్దార్ అనంతపురం వెళ్లారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు



గంధం సమర్పిస్తున్న దర్గా కమిటీ సభ్యులు, పీఠాధిపతులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో సయ్యద్ హజరత్ 678వ ఉరుసు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతులు, కమిటీ సభ్యులు చాదర్, గంధం సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి ఖవాలీ పోటీలు నిర్వహించారు. ఆదివారం జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయి. చివరి రోజు ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నేడు దంత వైద్య శిబిరం

శింగనమల(నార్పల): నార్పలలోని అయ్యప్ప, లక్ష్మీ నరసింహ ఆలయ అర్చకుడు బ్రహ్మేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. అనంతపురంలోని ప్రఖ్యాత్ దంత వైద్యశాల వైద్యులు హాజరవుతారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవంబర్‌లో రెవెన్యూ క్రీడలు

గార్లదిన్నె: అనంతపురంలో నవంబర్ 7నుంచి 9వ తేదీ వరకూ ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీఆర్ఏల జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగరాజు తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నాయకుల సమావేశంలో రెవెన్యూ క్రీడల గురించి చర్చించామన్నారు. రెవెన్యూ క్రీడల్లో వీఆర్‌ఏల స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు పాల్గొంటారన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



తాడిపత్రిలో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్



గుత్తిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే సాధు బాబు

తాడిపత్రి రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని, మెగా లోక్ అదాలత్ ద్వారా సత్వరం కేసులను పరిష్కరించుకోవడానికి వీలుంటుందని మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో పలు కేసు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్లు బెల్లం సదాశివారెడ్డి, కుమారస్వామి, బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజులరెడ్డి, శ్రీనివాసులు, న్యాయవాదులు దద్దం సుబ్బయ్య, ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి, చక్రపాణి, క్రిష్టయ్య, శంకర్‌రెడ్డి, సతీష్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏడీజే, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఏడీజే సాధుబాబు, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, ఎంవీఐ, ఎస్టీసీలు మొత్తం 202 కేసులు పరిష్కారం చేశారు. కక్షిదారులకు లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏజీపీ ఫక్రుబాషా, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పామిడి: సీతారాం ఏచూరి ఆశయసాధనకు పాటుపడతామని సీపీఎం మండల నాయకుడు పీ అనిమిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు మల్లేసు, సాయికుమార్, లక్ష్మణకుమార్, ఉసేనప్ప, మాబు తదితరులు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత



పర్సును బాధితుడికి అప్పగిస్తున్న వీఆర్‌ఏ జగదీష్

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద దొరికిన పర్సును శనివారం బాధితుడికి అప్పగించి వీఆర్‌ఏ జగదీష్ నిజాయతీ చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసం ఉండే వీఆర్‌ఏ సూరిపోగుల జగదీష్ ఈ నెల 12న విధుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. కార్యాలయం బయట కింద పడి ఉన్న ఓ పర్సు జగదీష్‌కు దొరికింది. అందులో రూ.1,830 నగదు, ఏటీఎం, గుర్తింపు కార్డులు ఉన్నాయి. వాటిని పరిశీలించి పర్సు పోగొట్టుకున్న వ్యక్తి మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ కె.కృష్ణమూర్తిగా గుర్తించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం దగ్గర పర్సును బాధితుడికి వీఆర్‌ఏ అప్పగించాడు.

విద్యార్థులూ.. ఒత్తిడికి గురికావొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు ఒత్తిడి, మానసిక ఆందోళన గురి కాకూడదని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలు, ఆత్మస్థైర్యంతో మెలగాలన్నారు. జీవతంలో ఎవరూ నిరాశ చెందరాదన్నారు. కార్యక్రమంలో మోహన్‌బాబు, కేశవయ్య, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు




అలంకరణలో కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రముఖ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న దేవరకొండపై వెలసిన కొండమీద రాయుడి ఆలయంలో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు స్వామి వారికి కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండ కింద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని ముసలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తాడిపత్రిటౌన్: 'ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి' అని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేసారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయడంతోపాటు సీపీఎస్ రద్దు చేయాలన్నారు. మెమో 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమీషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలను చెల్లించడంతోపాటు ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎస్.రాఘురాంరెడ్డి, కార్యదర్శి డేనియల్, శ్రీవాత్సవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు జయచంద్ర, పెద్దపప్పూరు మండల అధ్యక్షుడు రాంకిషోర్, రవికుమార్, అంకాలు, ఓబయ్య, రామంజి, అంజన్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు తగ్గింపు



బందోబస్తులో ఉన్న పోలీసులు

తాడిపత్రి రూరల్: వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి కొలతలు పూర్తి కావడంతో పోలీసు బందోబస్తును తగ్గించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి కొలతల కోసం రెండు రోజుల క్రితం మునిసిపల్ అధికారులు నియమించిన కమిటీ రావడంతో ముందు జాగ్రత్తగా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గాలు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఇరువురి ఇళ్లకు వెళ్లే రహదారుల్లో బందోబస్తును నియమించి బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇంటి కొలతలు ప్రశాంతంగా జరగడంతో పాటు ఇంట్లో పెద్దారెడ్డి లేకపోవడంతో పోలీసు బందోబస్తును 300 నుంచి 100 లోపు తగ్గించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన పద్మనాభరెడ్డి

గుత్తి రూరల్: మండలంలోని జక్కల చెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొందిపల్లికి చెందిన పద్మనాభరెడ్డి పని నిమిత్తం రాయలచెరువుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా జక్కలచెరువు గ్రామ శివారులో గుత్తి నుంచి యాడికికి వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పద్మనాభరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఇదే ప్రమాదంలో యాడికి ఆస్పత్రి కాలనీకి చెందిన దంపతులకు గాయాలు కాగా వారిని బంధువులు తాడిపత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ జయవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డిని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర తదితరులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. ఆస్పత్రిలో క్రమం తప్పకుండా ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించాలని, ఆస్పత్రికి అవసరమైనన్ని బీపీ ఆపరేటర్ మిషన్లు, స్టెతస్కోపులు, మందులను అందుబాటులో ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షాషావలి, సొహెల్, నాగిరెడ్డి, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో శనివారం ఆటోలో నుంచి జారి పడి గిరిబాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో నివాసం ఉండే గిరిబాబు పత్తికొండలో బంధువుల ఇంటికి పని నిమిత్తం వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని ఆటోలో గుత్తికి బయలుదేరాడు. అయితే బసినేపల్లి శివారు పెద్ద వంక వద్ద మలుపులో ఆటోలో పక్కన కూర్చున్న గిరిబాబు చేయి జారి రోడ్డుపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అదే ఆటోలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి పశువులకు 'గాలికుంటు టీకాలు'

పెద్దవడుగూరు: మండలంలోని పశువుల యజమానులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రమేష్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడతాయన్నారు. నోటి నుంచి తీగల మాదిరి చొంగ కార్చుకుంటాయన్నారు. చూడి పశువులు ఈసుకుపోతాయన్నారు. పశువులకు ఈ లక్షణాలు ఉంటే వెంటనే రైతులు పశువైద్యులను సంప్రదించాలన్నారు.

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రత్నకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ వైద్యులు ఇంటింటికీ వెళ్లి పశువులకు టీకాలు వేస్తారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆలయాల సందర్శన



హాజీవలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పూర్వ విద్యార్థులు



ఆలూరు కోనలో ప్రత్యేక పూజల్లో పూర్వ విద్యార్థులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పరిసరాల్లో ఉన్న ఆలయాలు, ప్రార్థనా మందిరాలను 1976–79లో శ్రీసత్యసాయి జిల్లాలోని కొడిగెనహళ్లి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సందర్శించారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి చెందిన వ్యాపారవేత్త శ్యాంసుదర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు తాడిపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు శనివారం పట్టణంలోని చింతల వేంకటరమణస్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి, ఆలూరు కోన రంగనాథస్వామి, హజీవలి దర్గా తదితర ఆలయాలు, ప్రార్థనా మందిరాలను సందర్శించి పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. గతంలో తాము 1976లో ఇదే రోజు(సెప్టెంబర్ 13)న కలుసుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, అమర్‌రాజ బ్యాటరీస్ సీఈఓ రమణ, జీఎం గల్లా విజయనాయుడు, ఐఆర్‌ఎస్ రామక్రిష్ణ, ఆర్అండ్‌బీ ఈఎస్‌సీ నయిముల్లా, పలువురు వైద్యులు, ఎల్‌ఐసీ డివిజన్ మేనేజర్లు డిప్యూటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి



చందన ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య పరిశీలకురాలు శైలజ

యాడికి: రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య పరిశీలకురాలు శైలజ సూచించారు. మండలంలోని చందన గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె జూమ్ యాప్ మీటింగ్ ద్వారా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు దేవరాజన్, సూపర్‌వైజర్ షబ్బీర్, ఏఎన్ఎం రజని తదితరులు పాల్గొన్నారు.